క్లుప్తంగా

పౌర హక్కులపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయలక్ష్మి

పాలకోడేరు: ప్రతి ఒక్కరూ రాజ్యాంగానికి బద్ధులై, హక్కులు బాధ్యతలు తెలుసుకోవాలని పాలకోడేరు మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎస్. భారతీ విజయలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం కోరుకొల్లులో జరిగిన సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం ప్రతి వారు కుల వివక్షత లేకుండా సమానంగా జీవించాలన్నారు. పౌర హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సమావేశంలో సచివాలయం సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరం పట్టణం ఇండస్ట్రియల్ ఏరియాలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త విద్యుత్ తీగల మార్పిడి కారణంగా మంగళవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా విలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్ వెంకటేశ్వర రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నరసయ్య అగ్రహారంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఆకివీడు: మండలంలోని చినకాపవరం 11 కేవీ ఫీడర్‌లో మరమ్మతుల దృష్ట్యా మంగళవారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఈఈ వెంకటేశ్వరరావు చెప్పారు. చినకాపవరం, గొల్లగూడెం ప్రాంతాల్లోని వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

2న హుండీ లెక్కింపు

ఉండి: మండలంలోని వీరపేరంటాలమ్మ అమ్మవారి హుండీని 2వ తేదీన లెక్కిస్తున్నట్లు ఆలయ ఇన్‌చార్జ్ కార్యనిర్వహణాధికారి తోట శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10 గంటలకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఈవో తెలిపారు.

పాత యేరుకు మోక్షం కల్పించండి

- ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోలేదు
- ఆక్రమణలతో కుంచించుకుపోయిన డ్రెయిన్



స్థానిక గుమ్ములూరు రోడ్డు నుంచి చినకాపవరం డ్రెయిన్ వరకూ కుచించుకుపోయిన పాత యేరు

ఆకివీడు: మురుగు నీటిని, అదనపు నీటిని ఉప్పుటేరులోకి తీసుకువెళ్లే పాతయేరు ఆక్రమణలతోనూ, పూడికలు పేరుకుపోయి కుంచించుకుపోయింది. సుమారు 10 కిలోమీటర్ల పొడవు, 30 మీటర్లకు పైగా వెడల్పుతో ఉన్న పాత యేరు కొన్ని చోట్ల ఆక్రమణలకు గురైంది. మరి కొన్ని చోట్ల కుంచించుకుపోయింది. వెంకయ్య వయ్యేరులోని అదనపు నీటిని, మాదివాడ ఆయుకట్టులోని మురుగు నీరు ఈ కాలువ ద్వారా చినకాపవరం డ్రెయిన్‌లోకి చేరి, ఉప్పుటేరులో కలుస్తుంది. కొన్ని చోట్ల కిక్కిస, జమ్ము, గుర్రపుడెక్కతో కాలువ పూడుకుపోయింది. దీనివల్ల ఏటా మాదివాడ ఆయుకట్టు భూములు ముంపుకు గురవుతున్నాయి. వందలాది ఎకరాల పంట నీటిపాలవ్వడంతో కోట్లాది రూపాయలు నష్టం వాటిల్లుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాతయేరును సర్వే చేయించి, ఆక్రమణల్ని తొలగించి, మురుగు నీటి పారుదలకు మార్గం ఏర్పరచాలని రైతులు కోరుతున్నారు.

నగర పంచాయతీ కాంట్రాక్టర్ సస్పెన్షన్

పనులు చేపట్టడంలో నిర్లక్ష్యవైఖరి



నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం

ఆకివీడు: అభివృద్ధి పనులు నిర్వహించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహిస్తూ, టెండర్ల పనులకు ఆటంకం కల్గిస్తున్న నగర పంచాయతీ కాంట్రాక్టర్ కుంపట్ల శ్రీరామ్‌ను ఏడాది పాటు సస్పెండ్ చేస్తూ ఏకగ్రీవ తీర్మానం చేసింది. స్థానిక నగర పంచాయతీ సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ జామి హైమావతి అధ్యక్షతన సోమవారం జరిగింది. అజెండాలోని 24వఅంశం మూడు అభివృద్ధిపనులకు ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్ కైవశం చేసుకున్న శ్రీరామ్ పనులు చేపట్టడంలో తీవ్ర జాప్యంచేస్తూ, అధికారులకు, ప్రజా ప్రతినిధులకు సరైన సమాధానం చెప్పకపోవడంతో టెండర్‌దారుడ్ని ఏడాదిపాటు టెండర్లు వేయకుండా సస్పెండ్‌చేస్తూ తీర్మానం చేశారు. పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుకు అవసరమైన పనిముట్లను కొనుగోలుచేసేందుకు చర్యలు చేపట్టాలని వైస్‌చైర్మన్ పుప్పాల పండు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. స్థానిక ముస్లింవీధిలో విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉన్న కల్వర్టును పునఃనిర్మించాలని వార్డు కౌన్సిలర్ నిమ్మల నాగు సూచించారు. కల్వర్టు ధ్వంసమవ్వడంతో మురుగునీరు పొంగి ప్రవహిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక గంగానమ్మ కోడుపై ఇరుకు కల్వర్టు ఉందని, దీని వల్ల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉందని వార్డు కౌన్సిలర్ నేరెళ్ల ప్రసన్న తెలిపారు. రైల్వే స్టేషన్‌కు, చేపల మార్కెట్‌లకు వెళ్లాలంటే ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు ఈ కల్వర్టుపై నుండే వెళ్లాల్సి వస్తుందన్నారు. వైస్ చైర్మన్ వంగా జ్యోత్స్న, విప్ పడాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు, మేనేజర్ వెంకటేశ్వరరావు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ సాకేత్ పాల్గొన్నారు.

అన్ని విభాగాల్లో అధ్యయనం అవసరం



భీమవరం ఎస్ఆర్‌కెఆర్ కళాశాలలో మాట్లాడుతున్న శాస్త్రి

భీమవరం: సాంకేతిక విద్యారంగం మరింత ప్రగతిని సాధించాలంటే అధ్యాపకులు సైతం తమకు సంబంధించిన కోర్సుకు పరిమితంగాకుండా ఇతర ఇంజనీరింగ్ విభాగాల్లో ప్రధానమైన అంశాలను అధ్యయనం చేయాలని కాకినాడ జేఎన్టీయూకే ప్రొఫెసర్ జీవీఎస్ శాస్త్రి అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జేఎన్టీయూకే కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో సింథసిస్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ అల్ట్రా ఫైన్ గ్రైండ్ మెటీరియల్స్ అండ్ కాంపోజిట్స్ అనే అంశంపై నిర్వహించే ఫ్యాకల్టీ డెవలప్మెంట్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంజనీరింగ్ అధ్యాపకులు ఎఫ్‌డీపీ, వర్క్ షాపులకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం వల్ల అదనపు విజ్ఞానాన్ని అధ్యయనం చేసేందుకు అవకాశముంటుందన్నారు. కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఇంజనీరింగ్ ఉత్పత్తులన్నీ సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ ఇలా రకరకాల విభాగాలకు సంబంధించిన పార్టికల్స్ అన్ని కలిపి ఒక ఉత్పత్తి రూపంలో బయటకు వస్తున్నాయని దీనిని గమనించి ఇతర విభాగాల సబ్జెక్టులు కూడా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కెవి మురళీకృష్ణం రాజు, మెకానికల్ ఇంజనీరింగ్ హెడ్ కె సురేష్ బాబు పాల్గొన్నారు.

వయో వృద్ధుల రక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

భీమవరం: తల్లిదండ్రులు, వయో వృద్ధుల పోషణ, రక్షణ చట్టాన్ని ప్రభుత్వం పటిష్టంగా అమలు చేసి వృద్ధులకు న్యాయం చేయాలని రిటైర్డ్ జడ్జి ఆకుల వెంకటశేషసాయి అన్నారు. సోమవారం భీమవరం సీనియర్ సిటిజన్స్ ఫోరం ఫర్ బెటర్ సొసైటీ దశాబ్ది వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. స్థానిక బ్యాంక్‌కాలనీలోని శ్రీకృష్ణదేవరాయ సాంస్కృతిక సమితి భవనంలో ఫోరం అధ్యక్షుడు నల్లం వెంకట కృష్ణ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) మాట్లాడుతూ నేటి సమాజంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ క్షీణించి వృద్ధులకు సమస్యలు పెరిగి ఆవేదనకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం ప్రధాన కార్యదర్శి బోనం పాండురంగారావు రాష్ట్రసంఘం ప్రధాన కార్యదర్శి కుకునూరి రామచంద్రరావు తదితరులు ఉన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి భీమారావు

ఉండి: అధికారం కోసం చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తక్షణమే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు ప్రభుత్వంపై మండిపడ్డారు. ఉండి జంగాల కాలనీలో సోమవారం పార్టీ జిల్లా సమితి సభ్యుడు సనపల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఉండి ఏరియా పార్టీ ప్రథమ మహాసభ సమావేశానికి భీమారావు ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరాజకీయ పార్టీకీ లేని ఘనమైన చరిత్ర 78 ఏళ్ల సీపీఐ పార్టీకి ఉందన్నారు. పేదల పక్షాన నిలిచి వారి సంక్షేమం కోసం ప్రాణాలు ఒడ్డి పోరాడిన పార్టీ అని అన్నారు. పేదల పక్షాన నిలబడివారికి న్యాయం చేస్తామని హామీలు ఇచ్చిన దేశ ప్రధాని చెప్పినవాటిలో ఏదీ నెరవేర్చలేదన్నారు. నిత్యావసర ధరలు తగ్గిస్తానని, నిరుద్యోగులకు ఉద్యోగాలిస్తానని అధికారంలోకి వచ్చిన మోదీ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. లాభాల్లో ఉన్న రూ.3.5 లక్షల కోట్ల విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అదానీ, అంబానీలకు అప్పగించడం సిగ్గు చేటని అన్నారు. ఆపరేషన్ కగారుతో నక్సలైట్లను ఆదివాసులను కాల్చి చంపడం తగదని హితవు పలికారు. ఉచిత బస్సు, నిరుద్యోగ భృతి, 20 లక్షల ఉద్యోగాలు ఎక్కడ అని ప్రశ్నించారు. ఆగస్టు 5, 6 తేదీల్లో జరిగే సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. జూలై 9వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మికులు, కర్షకులు, శ్రామికులు, ఉద్యోగులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఏరియా మహసభలో 25మంది నూతన కమిటీ ఏర్పాటు చేశారు. ఏరియా కార్యదర్శిగా కలిశెట్టి వెంకట్రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్డు ఉంటేనే కౌలు రైతుకు లబ్ధి



చెరుకుమిల్లి గ్రామంలో కౌలు కార్డులను పంపిణీ చేస్తున్న సర్పంచ్

ఆకివీడు: భూమి సాగు చేసే కౌలు రైతులు తమ శ్రమకు తగ్గ ప్రతిఫలం పొందేందుకు కౌలు కార్డులు తప్పనిసరిగా తీసుకోవాలని సర్పంచ్ నందమూరి ప్రకాశం పిలుపునిచ్చారు. మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలో కౌలు కార్డుల్ని సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌలుదారుల వల్ల సాగు భూముల్లో పంట పండుతోందన్నారు. కౌలు వ్యవస్థ లేకపోతే లక్షలాది ఎకరాల పంట భూములు నిర్వీర్యమయి పోయే ప్రమాదం ఉందన్నారు. కౌలు దారుల్ని ఆదుకునేందుకు ప్రభుత్వాలు చట్టాలు తీసుకు వస్తున్నాయన్నారు. ఆర్థికంగా కౌలుదారుడు బలపడినప్పుడే వ్యవసాయరంగం కుదుటపడుతుందని ప్రకాశం చెప్పారు. మండల వ్యవసాయాధికారి మధు మోహన్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కౌలు రైతులే అధికంగా ఉన్నారని చెప్పారు. కాయకష్టంతో పండించే పంటకు తగిన లాభం రావాలన్నా, ప్రభుత్వ పథకాలు పొందాలన్నా కౌలు కార్డు తప్పనిసరిగా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఆర్బీకే మాజీ డైరెక్టర్ ఎరిచర్ల సాంబర్లిన్, బోధనపు నాగరాజు, డాము బాల, తోట గోవింద్, రాజేష్, వీఆర్ఓ మన్నే శ్రీను పాల్గొన్నారు.

సీతారామరాజు మెమోరియల్ హాల్ పునర్నిర్మాణం చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీతారామ్

భీమవరం: భీమవరం పట్టణంలోని స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాల్‌ను కూలగొట్టి ఏళ్లు గడిచిపోతున్నా ఇంతవరకు నిర్మించకపోవడం అన్యాయమని ఉద్దరాజు రాము ఫౌండేషన్ చైర్మన్ మంతెన సీతారామ్ అన్నారు. సోమవారం భీమవరంలో అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాల్ పునఃనిర్మాణ సాధన కమిటీ ఆధ్వర్యంలో యుటీఎఫ్ కార్యాలయంలో బి వాసుదేవరావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2018లో మున్సిపల్ కౌన్సిల్ జి ప్లస్3 నిర్మాణం పేరుతో అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాల్ కూలగొట్టి ఇంతవరకు నిర్మాణం చేపట్టకపోవడం బాధాకరమన్నారు. జిల్లా కేంద్రంలో అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాల్‌ను నూతన టెక్నాలజీతో నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జెఎన్వీ గోపాలన్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు మెమోరియల్ హాల్ పునర్నిర్మాణ సాధన కమిటీ ఆధ్వర్యంలో జూలై 4న నిరాహార దీక్షలు చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వాలు మారుతున్న పోరాట యోధుని పేరును ఉన్న హాలు నిర్మించకపోవడం బాధాకరమన్నారు. ఈ సమావేశంలో చెరుకువాడ రంగసాయి, దండు శ్రీనివాసరాజు, ఎం వైకుంఠ రావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వెంకటరాయుడుకు అభినందనలు



వెంకటరాయుడుకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ సమన్వయకర్తగా నియమితులైన చినమిల్లి వెంకటరాయుడును సోమవారం పలువురు అభినందించారు. రాయలం గ్రామంలోని ఆయన నివాసం వద్ద మొగల్తూరు మండలానికి చెందిన పలువురు పార్టీ నాయకులు వెంకటరాయుడిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. వెంకటరాయుడును కలసిన వారిలో పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కోడే విజయలక్ష్మి, తన్నీడి గిరిబాబు, స్టేట్‌యూత్ స్పోక్ పర్సన్ బర్రె సమ్మోరు, పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి పాల రాంబాబు, కొత్తోట ఎంపీటీసీ లింగం ఏసుబాబు, మోడీ ఎంపీటీసీ తిరుమాని శివనాగరాజు, భీమవరం పట్టణ పార్టీ అధ్యక్షుడు గాదిరాజు రామరాజు, మాజీ అధ్యక్షుడు కోడే యుగంధర్ తదితరులున్నారు.

పదవీ విరమణ చేసిన పోలీసులకు సన్మానం

భీమవరం: పదవీ విరమణ చేసిన పోలీసు సిబ్బందిని భీమవరంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం అడిషినల్ ఎస్పీ వి భీమారావు ఘనంగా సత్కరించారు. ఆకివీడు పోలీసుస్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసిన కె శ్రీనివాసరావు, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ ఎ గంగారావు, తాడేపల్లిగూడెం హోంగార్డ్ సీహెచ్ శ్రీరామచంద్రమూర్తిలను దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం భీమారావు మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం క్రమశిక్షణకు మారుపేరని అలాంటి శాఖలో సుదీర్ఘ కాలం పాటు అంకిత భావంతో ప్రజలకు నిస్వార్థ సేవలందించి పదవీ విరమణ పొందుతున్న సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ ఎంవీవీ సత్యనారాయణ, డీసీఆర్‌బి ఇన్‌స్పెక్టర్ డి వెంకటేశ్వరరావు, ఆర్మ్‌డ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ కె వెంకట్రావు, పోలీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మోజేష్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన అవసరం

పాలకోడేరు: సీజనల్ వ్యాధులపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బంది పాలకోడేరు మండలంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ గులాబ్ రాజ్‌కుమార్ ఆదేశానుసారం సోమవారం పాలకోడేరు మండలం గొరగనమూడి గ్రామంలో వర్షాకాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై వైద్య ఆరోగ్య సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంబంధిత సిబ్బంది మాట్లాడుతూ వర్షాకాలంలో ఎక్కువగా తాగునీరు కలుషితం అయ్యే అవకాశాలు ఉంటాయని, దానివల్ల డయేరియా వంటి ప్రాణాంతక వ్యాధులు సంభవిస్తాయని అందువల్ల ముందుగానే తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెల్త్ అసిస్టెంట్ విజయ ప్రసాద్, ఏఎన్ఎంలు ఆదిలక్ష్మి, సుజాత, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌యుబీలో నీటిని తొలగించాలి

భీమవరం: భీమవరం మున్సిపాలిటీకి పాలకవర్గం లేకపోవడంతో పట్టణంలోని సమస్యలు పరిష్కారం గాక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి జెఎన్వి గోపాలన్ ఆందోళన వ్యక్తం చేశారు. మునిసిపాల్టీ పరిధిలో ఆర్‌యుబిలోని నిల్వ ఉంటున్న వ్యర్థపు నీటిని ఎప్పటికప్పుడు తొలగించే విధంగా శాస్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆర్‌యుబి వద్ద ఆందోళన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైకుంఠరావు, సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు బొక్కా సత్యనారాయణ, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, డేగల నాగు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా మార్కండేశ్వరరావు

ఆకివీడు: స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఈఓపీఆర్‌డీ మార్కండేశ్వరరావు ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీఓగా పనిచేసిన సుహాసిని కృష్ణా జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో ఎంపీడీఓగా ఎవరూ బాధ్యతలు స్వీకరించలేదు. ఇటీవల కాకినాడ నుంచి బదిలీపై ఈఓపీఆర్‌డీగా బాధ్యతలు స్వీకరించిన మార్కండేశ్వరరావుకు ఎంపీడీఓ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.